
సాక్షి
రాజన్న సిరిసిల్ల

బుధవారం, 16, ఆగస్టు, 2023



రాజన్న కోవెలలో భక్తుల రద్దీ

వేములవాడ: ఎములాడ రాజన్నను మంగళ వారం 10వేల మంది భక్తులు దర్శించుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి తమ ఇలవేల్పుకు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారు లు భక్తుల ఏర్పాట్లను పరిశీలించారు.



ఎల్‌ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీకి మంగళవారం నీటిని విడుదల చేశారు. ఒక్క గేటు ద్వారా ఎల్‌ఎండీకి 300 క్యూసెక్కుల నీరు తరలుతోంది. ప్రస్తుతం 20.28 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

గరిష్టం/కనిష్టం
33.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వేగంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

ఎస్పీ అఖిల్ మహాజన్‌కు కేటీఆర్ ప్రశంస



సిరిసిల్లక్రైం: ప్రయాణ సమయంలో బస్‌లో భరోసా పేరిట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన ఎస్పీ అఖిల్ మహాజన్ విధానాన్ని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా ప్రశంసించారు. ఈవ్‌టీజింగ్, వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకు సరికొత్త విధానామని అన్నారు. మహిళలు, విద్యార్థినుల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామి బస్‌లో భరోసా పేరిట పలు వాహనాల్లో సీసీ కెమెరాల ఏర్పాటును పంద్రాగస్టు సందర్భంగా సిరిసిల్ల కలెక్టరేట్ ఆవరణలో ఆవిష్కరించారు.

గోపాల మిత్రలను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న రవీందర్

సిరిసిల్లఅర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా పశుసంవర్ధక శాఖలో విధులు నిర్వహిస్తున్న గోపాల మిత్రలను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి, సమస్యలు పరిష్కరించాలని గోపాల మిత్ర రాష్ట్ర సంఘం అధ్యక్షుడు మారబోయిన రవీందర్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1,200 మంది గోపాల మిత్రలు 23 ఏళ్లుగా పశుసంవర్ధక శాఖలో విధులు నిర్వహిస్తున్నామన్నారు. చాలీచాలని వేతనాలతో కాలం వెల్లదీస్తున్నామని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరైన మంత్రి కేటీఆర్‌ని కలిసి తమ సమస్యల గురించి వివరించగా, సానుకూలంగా స్పందించారన్నారు. ఈ సమావేశంలో మారబోయిన రవీందర్, యాదయ్య, బందయ్య, మాస శ్రీనివాస్,భాస్కర్, చిన్నాజీ, రంజన్, సతీశ్, సంతోష్, శ్రీకాంత్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

'పంట నష్ట పరిహారం ఏమైంది?'



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: వడగండ్ల వర్షాలకు పంట నష్ట పోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.10వేలు పరిహారం అందిస్తామని ప్రకటించి ఇప్పటికీ అందించలేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వేములవాడ మండలం అనుపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నూటికి 90 శాతం రైతులకు వ్యవసాయ పనిముట్లు అందించిందన్నారు. ఇప్పుడు వ్యవసాయ పనిముట్లకు ఎలాంటి సబ్సిడీ లేదని తెలిపారు. రైతులకు రుణమాఫీ అని 2018 ఎన్నికల్లో చెప్పి ఇప్పటికీ రుణమాఫీ చేయకపోవడంతో ఆ రుణాలకు రూ.లక్షకు రూ.60వేల వడ్డీ అయిందని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, ఎంపీటీసీ రాజశేఖర్, రాజు, పర్శరాములు, ఆగయ్య, ప్రభాకర్‌రెడ్డి, మల్లేశం తదితరులు ఉన్నారు.



ప్రసంగిస్తున్న మంత్రి కేటీఆర్, వేదికపై ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు



కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న మంత్రి కేటీఆర్



పాల్గొన్న ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు

ప్రజల స్వప్నం నెరవేరింది

- అభివృద్ధి.. సంక్షేమంలో అగ్రస్థానం
- జిల్లాను దిక్సూచిగా నిలుపుదాం
- సెప్టెంబరులో ఆక్వా హబ్‌కు శంకుస్థాపన
- ఎడ్యుకేషన్ హబ్‌గా సిరిసిల్ల
- ప్రభుత్వ వైద్యంపై నమ్మకాన్ని పెంచాం
- పల్లెలు, పట్టణాలకు జాతీయస్థాయిలో అవార్డులు
- వేములవాడ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్
- స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి కె.తారకరామారావు

సిరిసిల్ల: తెలంగాణ రాష్ట్రం ఏ విధంగా ఉండాలని ప్రజలు స్వప్నించారో.. ఆ విధంగా ప్రజలే కేంద్ర బిందువుగా సుపరిపాలన సాగిస్తూ అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తున్నామని రాష్ట్ర ఐటీ, పురపాలక, పట్టణాభివృద్ధి, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి కె.తారక రామారావు అన్నారు. రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొని త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేశారు. పోలీస్‌గౌరవ వందనం స్వీకరించి ప్రసంగించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచి దేశానికి దిక్సూచిగా మార్చామన్నారు.

ప్రతిగింజా కొన్నాం

జిల్లాలో 2016లో 1,77,960 ఎకరాల్లో పంటలు సాగు చేయగా ప్రస్తుతం 2,40,430 ఎకరాలకు పెరిగిందన్నారు. జిల్లాకు కాళేశ్వరం ప్రాజెక్టుతో గోదావరి జలాలు రావడంతో సాగు విస్తీరణం మరింత పెరిగిందన్నారు. రైతుబంధు ద్వారా జిల్లాలో 11 విడతల్లో లక్షా 18వేల మంది రైతులకు రూ.1,176 కోట్లు అందించామని, రైతు బీమాలో 1,873 మందికి రూ.93.60కోట్లు సాయం అందిందని వివరించారు. రూ.లక్ష లోపు రైతుల పంట రుణాలను మాఫీ చేశామని అన్నారు. రైతులు పండించిన ప్రతిగింజా కొన్నామని, ఎరువులు, విత్తనాల కొరత లేకుండా, 24 గంటలు ఉచితంగా కరెంట్ ఇచ్చి వ్యవసాయాన్ని పండుగ చేశామన్నారు. ఏటా రూ.1,000 కోట్ల విద్యుత్ రాయితీని ×సెస్‌×కు అందిస్తున్నామని వెల్లడించారు. కాళేశ్వరం ప్యాకేజీ-9 పనులతో మల్కపేట రిజర్వాయర్ ద్వారా వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాల్లోని 96,150 ఎకరాలకు నీరు అందనుందని, జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నామని, మిషన్ కాకతీయలో రూ.102.79 కోట్లతో 294 చెరువులను బాగు చేశామని, మానేరు వాగుపై 11, మూలవాగుపై 13 చెక్ డ్యామ్‌లను రూ.155 కోట్లతో చేపట్టామని కేటీఆర్ వివరించారు. రూ.1258 కోట్లతో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా నీరు అందిస్తున్నామని తెలిపారు.

ఆక్వా హబ్‌కు శ్రీకారం

జిల్లాలో రూ.2000 కోట్లతో 366 ఎకరాల్లో 10వేల మందికి ఉపాధి కల్పించే ఆక్వా హబ్‌కు సెప్టెంబరులో శంకుస్థాపన చేస్తామని కేటీఆర్ వెల్లడించారు. రైల్వే లైన్‌తో ఆక్వా హబ్ అనుసంధానం చేస్తామన్నారు. జిల్లాలో చేపట్టిన మొక్కల పెంపకం ద్వారా హరితవిప్లవం, చేపల పెంపకం ద్వారా నీలివిప్లవం, మాంస ఉత్పత్తితో గులాబీ విప్లవం, పాడి పరిశ్రమతో క్షీర విప్లవాలు దేశానికి ఆదర్శంగా ఉన్నాయని వెల్లడించారు. జిల్లాలో టీఎస్ ఐ-పాస్ పథకం కింద రూ.1296 కోట్ల పెట్టుబడితో 825 పరిశ్రమల స్థాపించి, 6,568 మందికి ఉపాధి కల్పిస్తున్నామని, ఎస్సీ నిరుద్యోగులకు టీ ప్రైడ్ ద్వారా 1,070 పరిశ్రమలు, రవాణా వాహనాలకు రూ.56 కోట్ల రాయితీలు అందించామని, టీ-ఐడియాలో 32 పరిశ్రమలకు రూ.96 కోట్లు రాయితీ ఇచ్చామని తెలిపారు. దళిత బంధులో 206 యూనిట్లను అందించామన్నారు. 3,443 డబుల్ బెడ్రూం ఇళ్లను పూర్తి చేసి అందించామని వెల్లడించారు. గృహలక్ష్మిలో నియోజకవర్గానికి 3వేలు ఇళ్లు మంజూరు చేశామని ఒక్కో ఇంటికి రూ.3 లక్షలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు.



పోలీస్ గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి

వైద్యంపై నమ్మకాన్ని పెంచాం

జిల్లాలో వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, సిరిసిల్లలో మెడికల్ కాలేజీని వచ్చే నెలలో ప్రారంభిస్తామని కేటీఆర్ తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను కేసీఆర్ కిట్లతో పెరిగిందని, సర్కారు వైద్యంపై నమ్మకాన్ని పెంచామన్నారు. సిరిసిల్ల, వేములవాడ ఆస్పత్రులకు అవార్డులు వచ్చాయని, గర్భిణులకు సేవలు అందించేందుకు మాతృసేవ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. జిల్లాలో సర్కారు ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య పెరిగిందని వెల్లడించారు. భవిష్యత్‌లో మెడికల్ కాలేజీతో ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.

నేతన్నలకు బాసటగా..

జిల్లాలో నేతన్నలకు దేశంలో ఎక్కడా లేని విధంగా బీమా సౌకర్యం కల్పిస్తున్నామని, నేత కార్మికులు ఏ విధంగా చనిపోయినా వారి కుటుంబాలకు రూ.5లక్షల బీమా సొమ్ము అందుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 10 మంది నేత కార్మిక కుటుంబాలకు బీమా సాయం అందిందని తెలిపారు. నేతన్నలకు ప్రభుత్వ వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇస్తున్నామని, ఈ ఆర్డర్లతో వస్త్రపరిశ్రమలో పనిచేసే కార్మికులకు మెరుగైన వేతనాలు లభిస్తున్నాయని అన్నారు. నేతన్నల కోసం త్రిఫ్ట్ పథకం అమలు చేస్తున్నామని, 60 ఎకరాల్లో ఏర్పాటు చేసిన అపెరల్ పార్క్‌తో ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. ఇప్పటికే గోకుల్‌దాస్ సంస్థ అంతర్జాతీయ స్థాయికి సిరిసిల్ల వస్త్రాలను ఎగుమతి చేస్తూ 950 మందికి ఉపాధి కల్పిస్తుందన్నారు. నేతన్నలకు ప్రభుత్వం అండగా ఉంటూ భరోసా కల్పిస్తుందని వెల్లడించారు.

శాంతిభద్రతల పరిరక్షణలో..

నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో పోలీస్ యంత్రాంగం పని చేస్తుందని, శాంతిభద్రతలు వెల్లివిరిసిన సమాజంలోనే మానవ వికాసం సాధ్యమవుతుందని మంత్రి స్పష్టం చేశారు. మహిళల భద్రతకు 'ఆపరేషన్ జ్వాల' అమలు జరుగుతుందని, బస్‌లో భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించామని వెల్లడించారు. అన్ని రంగాల్లో జిల్లాను అగ్రస్థానంలో ఉంచి ఆదర్శంగా ఉండేలా అభివృద్ధి పనులు పరుగు తీస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, రాష్ట్ర సాంస్కృతిక సారథి, మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, టిస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్‌మహాజన్, అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, ఎన్.ఖీమ్యానాయక్, డీఆర్‌వోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్, గంగయ్య, ఏఎస్పీ చంద్రయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతు బంధు సమితి అధ్యక్షులు గడ్డం నర్సయ్య, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్లు జిందం కళాచక్రపాణి, రామతీర్థం మాధవి, డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి, జెడ్పీ సీఈవో బి.గౌతమ్‌రెడ్డి, 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్‌ఎస్ నాయకులు తోట ఆగయ్య, చీటి నర్సింగరావు, చెలిమెడ లక్ష్మీనర్సింహారావు, వివిధ మండలాల జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

11.15 గంటలకు జెండా వందనం

కలెక్టరేట్‌లో మంత్రి కేటీఆర్ 11.15 గంటలకు జెండాను ఆవిష్కరించడం చర్చనీయాంశమైంది. జిల్లాలో ప్రతిసారి ఉదయం 10.00 గంటలలోపు జెండా వందనం పూర్తి అయ్యేది. ఈసారి మాత్రం మంత్రి కేటీఆర్ 11.15 గంటలను ఆవిష్కరించడంపై అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు చర్చించుకున్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా జిల్లా

జిల్లా ఎడ్యుకేషన్ హబ్‌గా మారిందని, జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీ, జిల్లెల్ల వద్ద వ్యవసాయ డిగ్రీ కళాశాల, నర్సింగ్ కాలేజీ, వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీ, మెడికల్ కాలేజీ, గురుకులాలు, మైనార్టీ విద్యాలయాలు, డిగ్రీ కాలేజీలతో జిల్లాలో ఉన్నత ప్రమాణాలతో విద్యను అందిస్తున్నామని మంత్రి వెల్లడించారు. రగుడు-వెంకటాపూర్ 11 కిలోమీటర్ల బైపాస్ రోడ్డును రూ.95కోట్లతో నిర్మించామని, సిరిసిల్లలో రగుడు రహదారిని రూ.35 కోట్లతో ఫోర్‌లేన్ రహదారి విస్తరణ జరిగిందన్నారు. వేములవాడ ఆలయ అభివృద్ధి పనులు, పట్టణాన్ని జీఐఎస్ ఆధారిత మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని వివరించారు. ధరణి పోర్టల్ ద్వారా భూసంస్కరణలకు శ్రీకారం చుట్టామని, జిల్లాలో సులభంగా భూముల మ్యూటేషన్లు సాగుతున్నాయని వివరించారు. పల్లెలు, పట్టణాల్లోనూ అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. జిల్లాలో 345 మంది వీఆర్‌ఏలను రెగ్యులరైజేషన్ చేశామని, 59 మంది జేపీఎస్‌లకు గ్రేడ్-4 కార్యదర్శులుగా పోస్టింగ్ ఇచ్చామని తెలిపారు. జిల్లాలో 1,614 మందికి 2,858 ఎకరాల పోడు భూముల పట్టాలు ఇచ్చామని అన్నారు. 600 మందికి బీసీ, ఎంబీసీలకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించామన్నారు. జిల్లాలో వృద్ధులు బాసటగా డే కేర్ సెంటర్లను ఎల్లారెడ్డిపేట, మండెపల్లిల్లో ప్రారంభించామని తెలిపారు.



జిల్లా కోర్టులో జెండా ఎగురవేస్తున్న జడ్జి ప్రేమలత



జెండా వందనం చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్



జెడ్పీ ఆఫీస్‌లో జెండావందనం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్



కలెక్టర్ క్యాంపు ఆఫీస్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

మువ్వన్నెల జెండా రెపరెపలు

- ఘనంగా పంద్రాగస్టు వేడుకలు
- జిల్లా కేంద్రంలో మిన్నంటిన సంబురాలు

సిరిసిల్ల/సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో పంద్రాగస్టు వేడుకలు మిన్నంటాయి. వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. మంగళవారం జిల్లా అధికారులు వారి వారి కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. జిల్లా కోర్టులో జడ్జి ఎస్.ప్రేమలత, కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అనురాగ్ జయంతి, డీపీవో కార్యాలయం, జిల్లా ఏఆర్ హెడ్‌క్వార్టర్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్, జెడ్పీ ఆఫీస్, మంత్రి క్యాంపు ఆఫీసులో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో జెడ్పీ సీఈవో బి.గౌతమ్‌రెడ్డి, కలెక్టర్ సీసీ నాగరాజు, అదనపు ఎస్పీ చంద్రయ్య, జెడ్పీ డిప్యూటీ సీఈవో గీత, డీఎస్పీలు ఉదేయ్‌రెడ్డి, నాగేంద్రచారి, రవికుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, జెడ్పీటీసీలు కొమిరెశెట్టి విజయ, గుగులోత్ కళావతి, యేష వాణి, గట్ల మీణయ్య, కో ఆప్షన్ సభ్యులు చాంద్‌పాషా, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ శంకరయ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ పేరుతో స్వాహా?

- మెచ్యూరిటీ ముగిసినా డబ్బులు చెల్లించని వైనం
- ఫోన్లు స్విచ్ఛాఫ్.. సిబ్బంది మార్పు
- లబోదిబోమంటున్న వినియోగదారులు



సొసైటీ పేరుతో జారీ చేసిన పాస్‌బుక్

వేములవాడ: వేములవాడలో ఓ ప్రైవేట్ సొసైటీ పేరుతో రూ.కోటి వరకు వసూలు చేసి మెచ్యూరిటీ పూర్తయి రెండున్నర నెలలు గడుస్తున్నా డబ్బులు తిరిగి చెల్లించకుండా, సరైన సమాధానాలు చెప్పకుండా వ్యవహరిస్తున్న తీరు చర్చనీయాంశమైంది. పట్టణంలోని మల్లారం రోడ్డులో వెలసిన ఈ సొసైటీ కొద్ది రోజులుగా ఖాతాదారులకు సమాధానం చెప్పకుండా ముఖం చాటేయడంతో పాటు కార్యాలయంలోని సిబ్బందిని మార్చినట్లు ఇక్కడి ఖాతాదారులు పేర్కొంటున్నారు. డబ్బులు చెల్లించేందుకు నిత్యం కార్యాలయానికి వస్తున్న ఖాతాదారులకు ఇక్కడి సిబ్బంది పొంతనలేని సమాధానాలు చెబుతుండడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సొసైటీలో షేర్ తీసుకున్న వారికి అధిక లాభాలు వస్తాయని, షేర్ రుసుము రూ.500, మెంబర్‌షిప్ రూ.100, మొత్తం రూ.600 చెల్లించాల్సి ఉంటుందని ఖాతాదారులను చేర్చుకున్నారు. అలాగే ఇందులో మెంబర్‌గా ఉన్నవారికి రుణ సౌకర్యం ఉంటుందని, షేర్ తీసుకున్న ప్రతిఒక్కరికీ రుణం ఇవ్వాలనే నిబంధనలేదని, సీనియారిటీ ప్రకారం మాత్రమే ప్రాధాన్యం ఉంటుందని, షేర్ తీసుకుని ఖాతా రద్దు చేసుకుంటే కేవలం రూ.500 మాత్రమే తిరిగి చెల్లించడం జరుగుతుందనే నిబంధనలతో కూడిన ఖాతా బుక్కులను ఖాతాదారులకు అందజేశారు. రోజూ రూ.200 చొప్పున, కొంత మంది రూ. 500 చొప్పున ఏడాదిగా చెల్లిస్తూ వచ్చారు. కాగా తమ మెచ్యూరిటీ పూర్తయిన తర్వాత డబ్బులు చెల్లించమంటే మూడు నెలలుగా అవస్థలు పెడుతున్నారని, సంబంధిత మేనేజర్ ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంటుందని ఖాతాదారులు వాపోతున్నారు. పోలీసులు విచారణ జరిపించి 202 మంది ఖాతాదారులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

డబ్బులు ఇవ్వడం లేదు



నేను ఉజ్వల థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ మ్యూచువల్ ఎయిడెడ్‌సొసైటీలో డిసెంబర్ 1, 2022లో ఖాతా తీశా. అప్పటి నుంచి రోజూ రూ.200 చొప్పున చెల్లించా. మే 31, 2023 వరకు ఆరు నెలలు గడిచాయి. నాకు రావాల్సిన డబ్బులు ఇవ్వడం లేదు. ఫోన్ చేస్తే స్పందించడం లేదు. స్విచ్ఛాఫ్ చేస్తున్నారు. కార్యాలయానికి వెళ్తే కొత్త సిబ్బంది పొంతనలేని సమాధానాలు చెబుతున్నారు. దీని హెడ్‌ఆఫీస్ మంచిర్యాలలో ఉందని, చైర్మన్ శ్రీధర్, సీఈవో లక్ష్మణ్, రీజినల్ మేనేజర్ సతీశ్ అని అంటున్నారు. అధికారులు స్పందించి తప్పుడు సొసైటీలపై చర్యలు తీసుకుని పేదలకు డబ్బులు ఇప్పించాలని కోరుతున్నాం.

– వేముల శ్రీనివాస్, ఇడ్లీ సెంటర్ నిర్వాహకుడు, వేములవాడ

క్లుప్తంగా

మంత్రికి కృతజ్ఞత సన్మానం



మంత్రి కేటీఆర్‌ను సన్మానిస్తున్న సభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయం పునర్నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు చేసిన మంత్రి కేటీఆర్‌కు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం మంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలయ పునర్నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మంత్రి కేటీఆర్ మాట్లాడి టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సహకారంతో పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసిన సందర్భంగా కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఆలయ కమిటీ చైర్మన్ నంది కిషన్, అర్చకులు నవీన్‌శర్మ, గోపాలాచారిశర్మ, నాయకులు మీసం రాజం, పర్శరాములుగౌడ్, బొమ్మకంటి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

'పది' టాపర్లకు మెడల్స్ అందజేత



మెడల్స్ అందజేస్తున్న చిగురు వెంకన్న

ముస్తాబాద్(సిరిసిల్ల): పదో తరగతి టాపర్లుగా నిలిచిన కొండాపూర్, గూడెం జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం ముదిరాజ్ సంఘం కొండాపూర్ శాఖ అధ్యక్షుడు చిగురు వెంకన్న సిల్వర్ మెడల్స్ అందజేశారు. మస్కట్‌లో ఉన్న తమ సోదరుడు, సైంటిస్టు డాక్టర్ చిగురు ఆదిమలన్ బాబా కోరిక మేరకు చిగురు లచ్చమ్మ–కోటయ్యల జ్ఞాపకార్థం పదో తరగతి టాపర్లకు సిల్వర్ మెడల్స్ అందజేశామన్నారు. ఏటా విదార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు లక్ష్మి, సరిత, హెచ్‌ఎంలు ప్రభాకర్, ఉపసర్పంచులు బషీర్, శ్రీనివాస్, భూదేవి పాల్గొన్నారు.

గోశాలకు కోడెలు అందజేత



కోడెలు అందజేస్తున్న అధికారులు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలలోని కోడెలను జనగామ జిల్లా కడకండ్ల మండలం కేంద్రానికి చెందిన యాకన్న గోశాలకు 20 కోడెలు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం జయరం గ్రామానికి చెందిన శివసాకి గోశాలకు 20 కోడెలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాస్, నరసింహామూర్తి, శ్యామ్ తదితరులు ఉన్నారు.



మంత్రి కేటీఆర్ చేతులమీదుగా ప్రశంసపత్రం అందుకుంటున్న జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి



మామిండ్ల దశరథం, డీపీఆర్‌వో



సూర్యప్రకాష్, ఈఈ పీఆర్



శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఇరిగేషన్ ఆఫీసర్



అనిల్ కుమార్, ఎస్‌బీ సీఐ



ఉపేందర్, సీఐ



జునాఇద్, ఆర్ఎస్ఐ



ముస్తఫా, ఎక్సైజ్ శాఖ సీఐ



అన్సర్, మున్సిపల్ టౌన్ ప్లానర్



డాక్టర్ శోభారాణి



డాక్టర్ మురళీధర్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్

ఉత్తమ ఉద్యోగులు వీరే

సిరిసిల్లకల్చరల్: జిల్లాలోని పలువురు ఉన్నతాధికారులు, అధికారుల సేవలకు అవార్డులు వరించాయి. మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో జరిగిన వేడుకల్లో మంత్రి కేటీఆర్ వివిధ శాఖల్లోని ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, జిల్లా పౌర సంబంధాల అధికారి మామిండ్ల దశరథం, ఇంజినీరింగ్ విభాగం నుంచి సూర్యప్రకాశ్, జి శ్రీనివాసరెడ్డి, పురపాలన విభాగం నుంచి ఎస్‌కే అన్సార్, రెవెన్యూ సీసీలు ఎం నాగరాజు, జి.వెంకటరమణ, పంచాయత్ బి.చంద్రశేఖర్, కలెక్టరేట్ సిబ్బంది జి.సుజాత, సీహెచ్.సునీత, బర్ల లక్ష్మి, ఎస్‌కే మహ్మద్, సన్నిధి భాస్కర్, అనిల్ కుమార్, కె కౌశిక్‌కుమార్ ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

రెవెన్యూ శాఖ నుంచి..

నాయబ్ తహసీల్దార్ జయంత్‌కుమార్, శ్రవణ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, రమేశ్, నాయిని రఘులు.

పోలీస్ శాఖ నుంచి..

ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ వి.అనిల్‌కుమార్, టౌన్ సీఐ బి.ఉపేందర్, ఆర్ఎస్సైలు ఎస్.రాజు, సాయికిరణ్, ఎస్‌కే.జునాయిద్, ఏఎస్సై పి.శరత్, శివప్రసాద్, ఏ.రమేశ్, క్రాంతికుమార్, ఎస్.ప్రమీల, కానిస్టేబుళ్లు బి ప్రభాకర్, వి.నరేశ్, ఎస్.అనిల్‌కుమార్, సీహెచ్.రాజశేఖర్, పి.శంకర్, డి.రాజు,



రాజు, ట్రాఫిక్ ఎస్ఐ



సాయి కిరణ్, ఆర్ఎస్ఐ

కె.శ్యాంసుందర్, డి.శ్రీనథ్‌రాజు, డి.శ్రీకర్, యు.ధర్మతేజ, శ్రీనివాస్, బి.తిరుపతి, వి.కుమార్, టి.సుజాత, జి.కల్పనా రాణి, ఇ.గోపి, పి.శంకర్‌లు ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

వివిధ శాఖల నుంచి..

డిప్యూటీ సర్వేయర్ బి ప్రవీణ్‌కుమార్, సివిల్ సప్లయ్స్ నుంచి వినాయక్, బి.సంతోష్‌కుమార్, వ్యవసాయశాఖ నుంచి ఏఈవోలు రవళి, శ్రీధర్, గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి నక్క శ్రీకాంత్, ఎస్‌కే.అర్షద్ పాషా, చేనేత జౌళి శాఖ నుంచి ఎండీ.మొయిజొద్దీన్, ఎస్.నాగరాజు, పరిశ్రమల శాఖ సీనియర్ అసిస్టెంట్ వి.కృష్ణ, జెడ్పీ నుంచి పుట్టి లచ్చాలు, పి.ఉపేందర్, ఎల్.రాజు, పౌర







ఇంటింటా ఇన్నోవేటర్‌కు ఎంపికైన శ్రీనిధి (హన్మాజీపేట), పి.వినీల (దమ్మన్నపేట), సహస్ర (ఇల్లంతకుంట)

సంబంధాల శాఖ నుంచి గడ్డం శ్రీనివాస్, పంచాయత్‌రాజ్ నుంచి రవీందర్, బి.బాబు, విద్యా శాఖ నుంచి పి.రాములు, సీహెచ్.పద్మజ, ఉపాధి కల్పన విభాగం నుంచి కనకయ్య, వైద్య ఆరోగ్య శాఖ నుంచి నల్ల రమాదేవి, తుపాకుల శైలజ, ఎం.రేణుక, బి ప్రవీణ్.కుమారి, ఎం.పుష్పలత, పి.రేణుక, జి.శ్రీకాంత్, సీహెచ్ రాజకిశోర్, పి.ఉషారాణి, ప్రాంతీయ ఆసుపత్రి నుంచి డాక్టర్ ఏవీ శ్రీనివాస్, బాబు, ఎం.లక్ష్మీనారాయణ, ఎం రాజమణి, ఎస్.వేణుకుమార్, డాక్టర్లు బి.చైతన్య సుధ, కె.సంతోష్‌కుమార్ పి.తిరుపతి, స్టాఫ్‌నర్స్ జె.సుష్మకుమారి, జి.జ్యోతి,, బి.హేమంత్‌కుమార్, ఎస్.క్రాంతికుమార్, డి.లక్ష్మి, డాక్టర్ పి.నీరజలు అందుకున్నారు. మార్కెటింగ్ నుంచి రామేశ్వర్‌రావు, సంక్షేమశాఖ నుంచి బి.మహేందర్, పి.మంజుల, ఎం.రమేశ్, ఎం.నర్సమ్మ, జ్యోతి, డి.స్వప్న, సహకార శాఖ నుంచి ఎం. లక్ష్మయ్య, వి.ప్రశాంత్‌రెడ్డి, ఇతర విభాగాల నుంచి జి.మహేశ్‌కుమార్, ఎం.రాజమోహన్, కె సురేశ్, ఆర్.హరిప్రసాద్, పి.మల్లికార్జున్, జి.స్రవంతి, కిశోర్, ఏఐ సుదర్శన్‌రెడ్డి, అటవీ శాఖ నుంచి ఎండీ అఫ్జల్ హుస్సేన్, డి.అనూష, ఫిషరీస్ డి.కిరణ్‌కుమార్, పురపాలన నుంచి గొట్ట రాజయ్య, సంద్రగిరి లలిత, జి రాజిరెడ్డి, ఎం.భాస్కర్‌రెడ్డి, ఎస్.భూలక్ష్మి, ప్లానింగ్ విభాగం నుంచి పి.కిషన్‌రావు, ట్రెజరీ నంంచి కె.రంజిత్‌కుమార్, కె.అశ్విజ, జె.రవీందర్, పశు సంవర్ధక శాఖ నుంచి డాక్టర్ సీహెచ్.సంతోష్‌కుమార్, బ్యాంకింగ్ నుంచి బి.రామకృష్ణ, వి.సంపూర్ణ, 108 నుంచి పి.శ్రీనివాస్, ఆర్టీసీ నుంచి ఎస్ఎం.అహ్మద్, సెస్ నుంచి జి.దివ్య, కె.శ్రీదేవి, విద్యుత్ శాఖ నుంచి పి.కార్తీక్, గ్రంథాలయం నుంచి కె.మల్లయ్య, యువజన సర్వీసుల నుంచి ఆర్.వెంకటేశం, న్యాయసేవల నుంచి బి.రవీందర్‌రావు తదితరులు ప్రశంసాపత్రాలు అందుకున్న వారిలో ఉన్నారు. అలాగే ఇంటింటా ఇన్నోవేటర్‌కు ఎంపికైన సహస్ర(జెడ్పీహెచ్ఎస్, ఇల్లంతకుంట), పి.వినీల (దమ్మన్నపేట), జంకె శ్రీనిధి (జెడ్పీహెచ్ఎస్, హన్మాజీపేట)లకు ప్రశంసాపత్రాలు అందించారు. సిరిసిల్ల పట్టణ సమాఖ్య, యూనియన్ బ్యాంకు ద్వారా 85 మహిళా సంఘాలకు రూ.8 కోట్లు రుణాలు అందజేశారు.

సృజనాత్మకతను వెలికి తీయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

- కొత్త ఆవిష్కరణలే 'ఇంటింటా ఇన్నోవేటర్' లక్ష్యం
- మంత్రి కె.తారక రామారావు

సిరిసిల్ల: సమాజంలో ప్రతి ఒక్కరిలోనూ ఏదో సృజనాత్మకత ఉంటుందని, వాటిని వెలికి తీసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని మంత్రి కె.తారక రామారావు అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం విద్యార్థులు రూపొందించిన పరికరాలను పరిశీలించారు. కొత్త ఆవిష్కరణలే ఇంటింటా ఇన్నోవేటర్ లక్ష్యమన్నారు. రైతులు, విద్యార్థులు, గృహిణులు, వ్యాపారులు, ఉద్యోగులు ఎవరైనా సరే వారి ఆలోచనలకు అనుగుణంగా కొత్త ఆవిష్కరణలు తేవాలన్నారు. గంభీరావుపేట మండలం దమ్మన్నపేట విద్యార్థిని వి.వినీల రూపొందించిన మహిళా వంటమిత్ర పరికరం పని చేసే విధానాన్ని మంత్రి కేటీఆర్ పరిశీలించారు. ఇల్లంతకుంటకు చెందిన పి.సహస్ర రూపొందించిన వృద్ధుల హెల్పింగ్ హాండ్స్, వేములవాడ మండలం హన్మాజిపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన జె.శ్రీనిధి రూపొందించిన బోండా మేకింగ్ మిషన్లను మంత్రి కేటీఆర్ పరిశీలించి, వాటిని రూపొందించిన విద్యార్థినులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ శాంతా తౌటం, జిల్లా విద్యాధికారి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి ఆలయంలో ప్రసాదాల విక్రయానికి టెండర్

సిరిసిల్లటౌన్: ఇల్లంతకుంట మండలంలోని అనంతగిరి పోచమ్మ ఆలయంలో ప్రసాదం విక్రయానికి ఒక సంవత్సరానికి టెండర్లు ఆహ్వానించారు. మంగళవారం ఆలయ ఈవో మారుతిరావు ఒక ప్రకటన విడుదల చేసి మాట్లాడారు. 2023 సెప్టెంబర్ 1 నుంచి 2023 ఆగస్టు 31 వరకు కాల పరిమితితో సీల్డు టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. టెండరు ఫారంను ఈనెల 25 నుంచి 26వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆలయంలో రూ. 200 చెల్లించి పొందాలన్నారు. మరిన్ని వివరాలకు ఆలయ అధికారులు, సిబ్బంది సంప్రదించవచ్చని తెలిపారు.

ఇద్దరిపై కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): భూ తగదా విషయంలో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఎల్లారెడ్డిపేటకు చెందిన గన్న సాయిరెడ్డికి గ్రామశివారులో ఉన్న 17 గుంటల వ్యవసాయ భూమిలో వరిపంట సాగు చేస్తున్నాడన్నారు. ముదుసు సంతోష్‌రెడ్డి, మనుసు సుధాకర్‌రెడ్డిలు సాయిరెడ్డి పొలంలోకి ట్రాక్టర్‌తో ప్రవేశించి సాగు చేస్తున్న వరి పంటను పూర్తిగా ధ్వంసం చేశారని తెలిపారు. సాయిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చందుర్తిలో కారు చోరీ

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండల కేంద్రంలోని జలేందర్‌కు చెందిన కారును సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. జలేందర్ రోజులాగే తన కారును ఇంటి ఎదుట పార్కింగ్ చేసి రాత్రి నిద్రిస్తున్న సమయంలో ఎత్తుకెళ్లినట్లు వాపోయాడు. అయితే ఓ వ్యక్తితో డబ్బుల విషయంలో గొడవలు జరుగుతున్నాయని, ఆ వ్యక్తే ఈ చోరీకి పాల్పడ్డాడని అనుమానాలు వ్యక్తం చేశారు. ఈమేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై చందుర్తి ఎస్సై సిరిసిల్ల అశోక్‌ను వివరణ కోరగా కారు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనని, అయితే కారు తాళం చెవి లేకుండా లోపలికి ప్రవేశించరాదని, స్టార్ట్ చేయడం సాధ్యం కాదని, దీనిపై అనుమానాలు ఉన్నాయని తెలిపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని అన్నారు.

దుకాణంలో..

వేములవాడ: పట్టణంలోని న్యూ ఏటూ జెడ్ బజార్ దుకాణంలో మంగళవారం ఉదయం చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తెల్లవారు జామున 3 గంటలకు న్యూ ఏటూ జెడ్ బజార్ దుకాణం తాళం పగులగొట్టి అందులోంచి రూ.50వేలు నగదు దొంగలు ఎత్తుకెళ్లినట్లు దుకాణ యాజమాని మోతుకుపెల్లి ఎల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని వేములవాడ డీఎస్పీ నాగేంద్రాచారి, టౌన్ సీఐ కరుణాకర్, క్లూస్ టీం సిబ్బంది పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రాచారి తెలిపారు.



పంట పొలాల్లో 77 జెండాలు

వేములవాడ: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా వేములవాడలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆధ్వర్యంలో పంట చేనుల్లో మంగళవారం 77 జెండాలను ఎగురవేశారు. ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగా బ్రిటిష్ వారి బానిసత్వం నుంచి బయటపడ్డామన్నారు. నాయకులు కుమ్మరి శంకర్, రేగుల మల్లికార్జున్, సంటి మహేశ్, గోపు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీలోకి మిషన్ భగీరథ కార్మికులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట ఉమ్మడి మండలంలోని మిషన్ భగీరథ కార్మికులు మంగళవారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు సమక్షంలో యూనియన్‌లో చేరారు. అనంతరం వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాలకు సంబంధించిన నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు రాములు తెలిపారు. అధ్యక్షుడిగా భూక్య గోపాల్, ఉపాధ్యక్షుడిగా అజ్మీరా భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా మల్లారెడ్డి, సహాయ కార్యదర్శిగా ఎడ్ల ఎల్లం, కోశాధికారిగా శ్రీనివాస్, సభ్యులుగా నరేశ్, శేఖర్, మహేష్ ఎన్నికయ్యారు.



ఏఐటీయూసీలో చేరుతున్న కార్మికులు

మంత్రి కేటీఆర్‌కు వినతుల వెల్లువ

తంగళ్లపల్లి: మండలంలోని సారంపల్లి గ్రామంలో పర్యటించిన మంత్రి కేటీఆర్‌ను కలిసేందుకు ప్రజలు ఎగబడ్డారు. కార్యక్రమం ముగించుకుని వెళ్తున్న క్రమంలో మంత్రికి తమ వినతులు అందించేందుకు పోటీపడ్డారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీలో రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న 7,651 మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ ఫీల్డ్ అసిస్టెంట్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ స్టేట్ కమిటీ ద్వారా మంత్రికి విన్నవించారు. కార్యక్రమంలో కోలపూరి కనకరాజు, పసుల శేఖర్, పోచవేని ఆనంద్, శ్రీనివాస్, అంతయ్య తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న మంత్రి కేటీఆర్

కలప పట్టివేత



పట్టుబడిన కలప దుంగలు

చందుర్తి (వేములవాడ): మండలంలోని తిమ్మాపూర్‌లో గల పెద్దమ్మ గుడి సమీపంలో, నర్సింగాపూర్‌లోని మైదాన ప్రాంతాల్లో టేకు కలపను అక్రమంగా నిల్వ ఉంచినట్లు వచ్చిన పక్కా సమాచారంతో మంగళవారం పట్టుకున్నట్లు అటవీ శాఖ అధికారి రాఘవేంద్రరావు తెలిపారు. టేకు దుంగల విలువ ఎంత ఉంటుందో తర్వాత వివరిస్తామని అన్నారు. అయితే వాటి విలువ రూ.లక్షకు పైగా ఉంటుందని గ్రామస్తులు భావిస్తున్నారు.

రాజకీయ ఒత్తిళ్లతో పేర్లు బహిర్గతం చేయని అధికారులు?

తిమ్మాపూర్, నర్సింగాపూర్ గ్రామాల్లో పట్టుబడిన అక్రమ టేకు కలప విషయంలో రాజకీయ ఒత్తిళ్లతోనే నిందితుల పేర్లు బహిర్గతం చేయడం లేదని ఆయా గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. అయితే అటవీశాఖలో పనిచేస్తున్న సిబ్బందితో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని ఓ వ్యాపారి గ్రామాల్లో కలప స్మగ్లింగ్ కొనసాగిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఏది ఏమైనా విలువైన టేకు కలపను కాపాడటంతో అటవీశాఖ అధికారులు విఫలమవుతున్నారని తెలుస్తోంది.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

సిరిసిల్లఅర్బన్: తంగళ్లపల్లి మండలం చిన్నలింగాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు ఎంపీటీసీ బైరినేని రాముతో పాటు పలువురు మంగళవారం మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అదేవిధంగా ఇల్లంతకుంట మండలానికి చెందిన పలువురు ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, వైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పలు మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బుల్డోజర్ ఆపరేటర్ మృతి



శ్రీనివాస్ మృతదేహం



రేలింగ్‌కు చిక్కుకున్న బైక్

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ చౌరస్తాలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. స్థానికుల వివరాలు.. కొత్తపల్లి మండలం కమాన్‌పూర్‌లోని ఎస్వీజీ గ్రానైట్ కంపెనీలో బుల్డోజర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న టి.శ్రీనివాస్ (40) ఇంటికి వస్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. పంద్రాగస్టు వేడుకను పురస్కరించుకొని గ్రానైట్ కంపెనీలో జెండా పండగలో శ్రీనివాస్ పాల్గొన్నాడు. అనంతరం తోటి కార్మికులతో విందులో పాల్గొన్నట్లు తెలిసింది. విందు ముగించుకొని కమాన్‌పూర్ నుంచి కరీంనగర్‌లోని శివ థియేటర్ వద్ద ఉన్న తన ఇంటికి వస్తున్న క్రమంలో శాతవాహన యూనివర్సిటీ చౌరస్తాలో బైక్ అదుపు తప్పి రేలింగ్‌ను బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్ రేలింగ్‌కు చిక్కుకోగా, శ్రీనివాస్ రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతిచెందాడు. కొత్తపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..



చంద్రయ్య (ఫైల్)

మానకొండూర్: మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన రాదారపు చంద్రయ్య(55) చికిత్స పొందుతూ మృతిచెందాడు. సీఐ రాజ్‌కుమార్ వివరాలు.. చంద్రయ్య రెండుమూడేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని మందులు వాడినా తగ్గడం లేదు. కడుపునొప్పి భరించలేక ఈ నెల 13న రాత్రి ఇంటి వద్ద గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఐక్కవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరు..



సతీశ్ (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. మండలంలోని మడిపల్లి గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌పై కోతి మృతి చెందగా, దానిని తొలగించే క్రమంలో అదే గ్రామానికి చెందిన ముకుంద సతీశ్ (54) విద్యుత్ షాక్ గురై పక్కన ఉన్న సపోర్టు స్తంభంపై పడగా తలకు తీవ్రగాయాలైనాయి. స్థానికులు గమనించి ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య లత, కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు ఫణిందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రవి తెలిపారు. కాగా సదాశివ ఫౌండేషన్‌కు మృతుడి కళ్లు దానం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.